


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక





సంపుటి: 01 సంచిక : 248. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శనివారం.21.06.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబుతో చర్చలకు సిద్ధం: రేవంత్ రెడ్డి

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరితోనూ వివాదాలు కోరుకోవడం లేదని, అయితే తెలంగాణ హక్కులను మాత్రం వదులుకునే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి, పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలుత తెలంగాణను సంప్రదించకుండా నేరుగా కేంద్ర ప్రభుత్వానికి ప్రాథమిక సాధ్యసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్) సమర్పించడమే ప్రస్తుత వివాదానికి మూలకారణమని రేవంత్ రెడ్డి అన్నారు.

"పీఎఫ్ఆర్ ఇచ్చే ముందే మాతో చర్చించి ఉంటే ఈ వివాదం ఉండేది కాదు. కేంద్రానికి ఏపీ నివేదిక ఇవ్వగానే, కేంద్రం కూడా అన్ని రకాల చర్యలకు సిద్ధమవుతోంది" అని ఆయన వివరించారు. ఈ అంశంపై చర్చించేందుకు తమకు ఎలాంటి బేషజాలు లేవని, ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై మాట్లాడుకుందామని ఆయన సూచించారు. "ఒక రోజు కాదు, అవసరమైతే నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయి. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుందని, ఈ భేటీలో బనకచర్ల అంశంపై సమగ్రంగా చర్చించిన తర్వాత, ఆంధ్రప్రదేశ్‌ను అధికారికంగా చర్చలకు ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. "ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం. తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదు" అని ఆయన అన్నారు. విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు ఇప్పటికే అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసిందని ఆరోపించారు."నీళ్లు, నిధుల పేరిట బీఆర్ఎస్ నేతలు మోసపూరిత సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకున్నారు. రాయలసీమను రత్నాలసీమ చేస్తానని కేసీఆర్ అన్నారు. గోదావరి



జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని కూడా గతంలో వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచ్చింది కేసీఆర్, హరీశ్ రావులే" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తాను కృష్ణా జలాల్లో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్ఓసీ అడిగితే మాజీ మంత్రి హరీశ్ రావు తప్పుపడుతున్నారని, ఆయన వాదనలో పసలేదని అన్నారు. 2023లో కేంద్రానికి హరీశ్ రావు రాసిన లేఖలో కేవలం 405 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు అడిగారని గుర్తుచేశారు.

"విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు. దీనిపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. గోదావరిలో 968 టీఎంసీలు వాడుకునే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కానీ, కేటాయించిన నీటిని వాడుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతోనే వివాదాలు తలెత్తుతున్నాయి" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాద పరిష్కారానికి ఎలాంటి కాలపరిమితి లేదని స్పష్టం చేశారు. జూలై 6, 7 తేదీల్లో మరోసారి ఢిల్లీలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. అధికారం కోల్పోయిన అసహనంతోనే హరీశ్ రావు విమర్శలు చేస్తున్నారని, తెలంగాణకు అన్యాయం చేసింది కేసీఆర్, హరీశ్ రావులేనని పునరుద్ఘాటించారు. కేటీఆర్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లైజనింగ్ అధికారిగా పని చేస్తున్నారని, కేసీఆర్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, అమిత్ షా గతంలో అన్నారని గుర్తుచేశారు.

## ఐదో విడతలో సుదీర్ఘంగా..

అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్ రావును శుక్రవారం ఐదో విడత సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. దాదాపు ఎనిమిది గంటల పాటు ఆయనను ప్రశ్నించారు. ఈ సారి సైతం ప్రభాకర్‌రావు నుంచి ఫోన్‌ట్యాపింగ్ జరపటానికి వెనుక అప్పటి పొలిటికల్ బాస్‌ల హస్తం ఉందా? అనే విషయంలో మాజీ ఐజీ నుంచి నిర్దిష్టమైన సమాధానాన్ని సిట్ అధికారులు రాబట్టలేక పోయారని తెలిసింది. అయితే, అప్పటి పోలీసు బాస్‌లైన డీజీపీలు అంజనీకుమార్, మహేందర్‌రెడ్డిల ఆదేశాలతో పాటు వారి అనుమతుల మేరకే ఫోన్ ట్యాపింగ్‌లను సాగించినట్టు ప్రభాకర్ రావు సిట్ అధికారులకు వెల్లడించా రని సమాచారం. ఇదే విషయాన్ని ఇంతకముందు తెలిపిన ప్రభాకర్‌రావు తాజాగా కూడా పదే పదే ప్రస్తావించినట్టు తెలిసింది.

ఈ కేసులో నిందితులు, వాంగ్మూలాలిచ్చినవారి రికార్డులను ప్రభాకర్ రావు ఎదుట ఉంచి ఫోన్‌ట్యాపింగ్‌లకు పూర్తిగా మీ బాధ్యతే అని వారిచ్చిన సాక్ష్యాలు నిజం కావా? అని ప్రశ్నించి నప్పుడు..



అందులో అన్నీ నిజం కావు కదా అని ప్రభాకర్‌రావు ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. ఐదోరోజు కూడా ప్రభాకర్‌రావు ఇచ్చిన వాంగ్మూ లాన్ని సిట్ అధికారులు ఒక్క సెకండ్ కూడా పొల్లు పోకుండా వీడియో చిత్రీకరణ జరిపినట్టు తెలిసింది. తిరిగి మిమ్మల్ని విచారిస్తామని ఆయనను సిట్ అధికారులు పంపించివేశారు. ఇదిలా ఉంటే.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నుంచి కూడా ఈ కేసులో వాంగ్మూలాన్ని తీసుకోవాలని సిట్ అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి ఆయనకు కూడా తమ ఎదుట హాజరు కావాలని సిట్ అధికారులు కోరనున్నారని తెలిసింది.

నా ఫోన్లు ట్యాపింగ్ చేశారు : కాంగ్రెస్ నాయకుడు గోనె ప్రకాశ్‌రావు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఏపీఎస్‌ఆర్టీసీ మాజీ చైర్మెన్ గోనె ప్రకాశ్‌రావు శుక్రవారం సిట్ అధికా రుల ఎదుట హాజరై వాంగ్మూల మిచ్చాడు. అప్రజాస్వామికంగా ప్రతిపక్ష నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేసిన పోలీసు అధికారులతో పాటు వారి వెనుక ఉన్నవారు ఎంత పెద్ద వారైనా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను కోరాడు.

## ఇంజినీరింగ్ ఫీజులపై సందిగ్ధం?

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ కొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలతో సంప్రదించి తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) నివేదిక ఇచ్చినా ఫీజులను ఖరారు చేయలేదు. దీంతో ఇంజినీరింగ్ ఫీజులపై సందిగ్ధం నెలకొంది. అయితే టీఏఎఫ్ఆర్సీ ఇచ్చిన నివేదికను పరిశీలించేందుకు అధికారులతో కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశమున్నది. అప్పుడే ఇంజినీరింగ్ ఫీజులను ఖరారు చేయాలని భావిస్తున్నది. ఇప్పటికే ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ఆలస్యమవుతున్నది. ప్రతిభ గల విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, ప్రయివేటు విశ్వవిద్యాలయాల్లో చేరుతు న్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత విద్యాసంవత్స రంలో ఉన్న పాత ఫీజుల ఆధారంగానే ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. మూడు, నాలుగు రోజుల్లో షెడ్యూల్‌ను విడుదల చేస్తామని ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి తనను కలిసిన విలేకర్లతో చెప్పారు. అయితే షరతులు వర్తిస్తాయని చెప్తున్నారు. ఒకవేళ అధికారుల కమిటీ ఫీజులను పెంచాలని నివేదిక ఇస్తే దాని ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఫీజులను ఖరారు చేస్తే పెరిగిన ఫీజులే అమల్లోకి వస్తాయంటూ షరతు విధిస్తామని అన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత విద్యామండలి నిర్ణయంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు.

ఫీజులు ఎప్పుడు ఖరారవుతాయో%ౌ

%రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీలున్నాయి. గత విద్యాసంవత్సరంలో 1,18,989 సీట్లుంటే, 1,07,160 సీట్లు భర్తీ అయ్యాయి. 2025-26 విద్యాసంవత్సరంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆగస్టు 14 నుంచి తరగతులను ప్రారంభించాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) నిర్ణయించింది. దీని ఆధారంగా ఉన్నత విద్యామండలి ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను తయారు చేస్తున్నది. ఇంకోవైపు ఐఐటీల్లో ప్రవేశాలకు జోసా కౌన్సెలింగ్ తేదీలను దృష్టిలో ఉంచుకుని అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే రాష్ట్రంలో ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల ఫీజులు ఖరారు కాకపోవడం అందరినీ అయోమయానికి గురిచేస్తున్నది. ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రస్తుతం అమల్లో ఉన్న ఫీజులు 2024-25 విద్యాసంవత్సరంతో ముగిశాయి. 2025-26, 2026-



27, 2027-28 విద్యాసంవత్సరాలకు సంబంధించి కొత్త ఫీజులు ఖరారు చేయాల్సి ఉన్నది. దీనిపై టీఏఎఫ్ఆర్సీ కసరత్తు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కానీ ప్రభుత్వం దాన్ని ఆమోదించలేదు. అధికారుల కమిటీ వేయాలని నిర్ణయించింది. 2025-26 విద్యాసంవత్సరంలో గత విద్యాసంవత్సరంలో ఉన్న పాత ఫీజులే అమల్లో ఉంటాయని ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో ఇంజినీరింగ్ ఫీజులు ఎప్పుడు ఖరారవుతాయోనన్న ఆందోళన విద్యార్థుల్లో వ్యక్తమవుతున్నది. విద్యాసంవత్సరం మధ్యలో ఉత్తర్వులు వచ్చినా వాటిని అమలు చేయాల్సి ఉంటుంది. దీంతో ఏ కాలేజీలో ఎంత ఫీజు ఉంటుందో తెలియకుండా చేరెదెలా?అంటూ విద్యార్థులు గందరగోళానికి గురయ్యే అవకాశమున్నది.

కోర్టుకు వెళ్లే ఆలోచనలో కాలేజీలు

ఫీజులను ఇప్పటి వరకు ఖరారు చేయకుండా పాత వాటితోనే కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడితే హైకోర్టును ఆశ్రయించే ఆలోచనలో ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలున్నట్టు తెలిసింది. ఈ విషయంపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు చేస్తున్నట్టు సమాచారం. ఫీజులు ఖరారు చేయకుండా కౌన్సెలింగ్ నిర్వహించడం సరైంది కాదన్న అభిప్రాయంతో ఉన్నాయి. ఇంకోవైపు టీఏఎఫ్ఆర్సీ ఫీజుల పెంపునకు అంగీకారం తెలిపిన తర్వాత ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోకవడం సమంజసం కాదని చెప్తున్నాయి. ఫీజుల ఖరారుకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చిన తర్వాతే ప్రవేశాల కోసం కౌన్సెలింగ్‌ను చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

## బండి సంజయ్‌కి త్వరలో సిట్ నోటీసులు!


హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి త్వరలో సిట్ నోటీసులు జారీ చేసే అవకాశముంది. ఫోన్ ట్యాపింగ్ విషయంలో వాంగ్మూలం ఇచ్చేందుకు సమయం ఇవ్వాలని జూబ్లీహిల్స్ పోలీసులు కేంద్ర మంత్రికి శుక్రవారం ఫోన్ చేసి కోరారు. ఆయన ఫోన్ ట్యాప్ అయ్యిందని వెల్లడించారు. విచారణకు సిద్ధంగా ఉండాలని కోరారు. షెడ్యూల్ చూసుకుని టైం ఇస్తానని మంత్రి బండి సంజయ్ పోలీసులకు తెలిపారు. ఈ అంశంపై ఆయనకు ఒకటెండ్రు రోజుల్లో సిట్ నోటీసులు జారీ చేసే అవకాశముంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తొలుత తెరపైకి తెచ్చింది బండి సంజయనే. బీఆర్ఎస్ ప్రభుత్వం



ఉన్న సమయంలో ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న సంగతి తెలిసిందే. తనతో పాటు బీజేపీ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారంటూ పలుమార్లు బండి సంజయ్ అప్పట్లోనే ఆరోపించారు. తన కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సిబ్బంది, ప్రధాన అనుచరుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని పలుమార్లు పేర్కొన్న విషయం విదితమే. ఇప్పుడు కేంద్ర మంత్రి హోదాలో బండి సంజయ్ ఏం వాంగ్మూలం ఇస్తారనే దానిపై ఆస్తకి నెలకొంది.

## హన్మకొండ జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు

నయీంనగర్ : అమృత్ తెలంగాణ: హనుమకొండ జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు కాల్ తీవ్ర కలకలం రేపింది. హనుమకొండ అదాలత్‌లోని జిల్లా కోర్టులో బాంబు పెట్టినట్టు శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి డయల్ 100కి ఫోన్ చేసి చెప్పాడు. ఇలా బెదిరింపు కాలు రావడం ఇది మూడోసారి. వెంటనే అప్రమత్తమైన సుబేదారి పోలీసులు కోర్టు ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. బాంబు కలకలంతో న్యాయవాదులు, లాయర్లు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తనిఖీల్లో భాగంగా కోర్టు ఆవరణలో భద్రపరిచిన ఆరు డిటోనేటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ డిటోనేటర్లను ఆత్మకూరుకు



చెందిన ఓ కేసు విషయంలో గతంలో స్వాధీనం చేసుకున్నవిగా పోలీస్ వర్గాల సమాచారం. ఈ డిటోనేటర్లకు సంబంధించిన కేసు కూడా గతంలోనే కోర్టు కొట్టేసినట్టు సమాచారం. దీంతో తాజాగా బాంబు బెదిరింపు కాల్‌కు ఈ డిటోనేటర్లకు ఎలాంటి సంబంధమూ లేనట్టు పోలీసులు తెలిపారు. ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా మరే ఇతర బాంబు లేదని నిర్ధారణకు రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## పోలవరం ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణకివ్వాలి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: పోలవరం ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ నెల 25న తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, చత్తీస్ గఢ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రగతి ఎజెండా పేరిట ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిర్వహించబోయే సమావేశంలో ఈ అంశంపై చర్చించాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. పోలవరం ముంపు, ఏపీలో కలిపిన భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలనే డిమాండ్లపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఏపీలో కలిపిన పురుషోత్తపట్నం, గుండాల, ఏటపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారు రెండు రాష్ట్రాల మధ్య వివక్షకు గురవుతూ, ఏ ప్రభుత్వం పట్టించుకోకుండా ఉన్నారని వివరించారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందనీ, భారీ వరదలొస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందని తెలిపారు. పోలవరం స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందనీ, భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో



భద్రాచలం రాముడికి చెందిన దేవుని మాన్యం భూమి వెయ్యి ఎకరాలుందనీ,అది ఆంధ్రాకి పోయిందని తెలిపారు.ఆ భూమి అన్యాక్రాంతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ముంపుపై ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు సంయుక్త సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ అంశంపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## బనకచర్ల ప్రాజెక్టు వెనుక కేంద్రం కుట్ర

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్ వెనుక కేంద్రం కుట్ర ఉందని టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణ జల దోపిడీకి నిర్ణయాలు తీసుకుంటున్న రాష్ట్రంలో బీజేపీ మౌనంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, విభజన చట్టాన్ని పట్టించుకోకుండా ఆంధ్రప్రదేశ్‌తో కేంద్రం చాటుమాటు వ్యవహారం మాదిరిగా బనకచర్లకు సంబంధించి వినతిని పరి గణనలోకి తీసుకోవడం సరికాదని హితవు పలి కారు. శుక్రవారం హైదరాబాద్‌లోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో ఆయన మాట్లాడారు. కేంద్రం సరైన సమ యంలో సరైన రీతిలో స్పందించకుండా సమస్యను జఠిలం చేసిందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్న అసమానతలు, చారిత్రక వాస్తవాలను కేంద్రం గ్రహించడం లేదని తప్పుపట్టారు. విభజన చట్టంలో నదీ జలాల వివా దం ప్రధానమైందనీ, ఆ వివాదాల




పరిష్కారానికే కృష్ణా, గోదావరి నదు లకు ప్రత్యేక బోర్డుల ఏర్పా టు, ఆ రెండింటిపై ఒక అపెక్స్ బాడీని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ఆ బోర్డు దగ్గరికి వెళితే రాష్ట్ర ప్రభు త్వానికి అక్కడే అభ్యంతరం చెప్పే అవకాశం ఉండేదని తెలిపారు. అలా కాకుండా కేంద్ర ప్రభు త్వం దగ్గరికి వెళ్లడం, కేంద్రం కూడా ప్రోత్సహిం చిందని అభ్యంతరం వ్యక్తం చేశారు.

## అబ్దుల్ ఖయ్యూం, అకాల మరణం తీవ్రంగా కలిచివేసింది: ఖానాపూర్ ఎమ్మెల్యే వేడుమ బొజ్జు పటేల్ తీవ్ర ఆవేదన.....

### మృతి పట్ల సంతాపం తెలిపిన ఎమ్మెల్యే...



ఉట్నూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అకాల మరణం

నిర్మల్ జిల్లా ఖానాపూర్ జూన్ 20 అమృత్ తెలంగాణ ఉట్నూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యూం గారి అకాల మరణం తీవ్రంగా కలిచివేసిందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెద్మ బొజ్జు పటేల్ గారు విచారం వ్యక్తం చేశారు.నిత్యం పార్టీ కోసం, పేదల సంక్షేమానికి పాటు పడుతున్న నాయకుడని, అహర్నిశలు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకుడు మన మధ్య లేరనే వార్త జీర్ణించుకోలేకపోతున్నానని అన్నారు.వారి మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## అంగన్ వాడి భవనాల నిర్మాణానికి నిధుల మంజూరు : ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యేరామారావు పటేల్

నిర్మల్ జిల్లా ముధోల్ జూన్ 20 అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గంలో ఏడు అంగన్వాడి కేంద్రాలకు భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. ఒక్క భవన నిర్మాణానికి 12 లక్షల రూపాయల నిధులు ఇవ్వన్నట్లు చెప్పారు. బైంసా మండలంలోని సుంక్లి, కుభీర్ మండల కేంద్రం లోని మొదటి అంగన్వాడి కేంద్రం, కుంటాల మండలంలోని లింబ కె, లోకేశ్వరం మండలంలోని రాజురా, తానూర్, బాసర, ముధోల్ మండల కేంద్రాల్లో అంగన్వాడి భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి అంగన్వాడి కేంద్రాలు అద్దె గదుల్లో కొనసాగడం మూలంగా చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను దృష్టిలో ఉంచుకొని దశలవారీగా నిధులు మంజూరు చేయించనున్నట్లు చెప్పారు. ఏడు అంగన్వాడి కేంద్రాలకు 84 లక్షల రూపాయల నిధులు వచ్చాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

## బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం..

భువనగిరి: అమృత్ తెలంగాణ: భువనగిరి మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన బాల్యమిత్రుడు గుర్రం బిక్షపతి ఇటీవల గుండెపోటుతో మరణించారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ .. తన బాల్య స్నేహితుని కుటుంబానికి ఏదైనా సహకారం అందించాలని నిర్ణయించుకొని, అందరు కలిసి జడ్పీహెచ్ఎస్ చందుపట్లలో పదవ తరగతి వరకు విద్యను అభ్యసించిన చందుపట్ల, బండ సోమవారం, వీరవెల్లి ,గౌస్ నగర్, చీమల కొండూరు గ్రామాలకు చెందిన బాల్యమిత్రులు

## రాజకీయ పబ్బం గడపడం కోసమే-రాద్ధాంతం



అమృత్ తెలంగాణ ఖానాపూర్ నియోజకవర్గ న్యూస్ : ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ప్రజలకు మభ్య పెడుతున్న బి ఆర్ ఎస్ బీజేపీ పార్టీలు ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ ఖానాపూర్ నియజవర్గానికి మంజూరైన యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ను ఎమ్మెల్యే గారు ఉట్నూరు కు తరలించారని ఆరోపిస్తూ నిన్న నిరసన కార్యక్రమం చేపట్టిన \BRS BJP చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవనీ అన్నారు. కేవలం రాజకీయ లబ్ధి పొందేందుకు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కావాలని రాద్ధాంతం చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారనీ. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుండి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా లాంటి అభివృద్ధి పథకాల్లో దూసుకెళుతున్న విషయాన్ని జీర్ణించుకోలేక BRS. BJP.అబద్ధపు ధర్నాలు అవస్తవపు మాటలు మాట్లాడుడం సరైనదికాదన్నారు ఖానాపూర్ లో 79 ఎకరాల భూమికి 70 ఎకరాలు రికార్డుల్లో చూపిస్తుంది దీనికి సంబంధించి అన్ని విషయాలు ఎమ్మెల్యే గారూ ఖానాపూర్ తహసీల్దార్ గారిచే 70 ఎకరాలు ఎవరెవరికి ఎంత కేటాయించబడినదో తెలియపరిచారు ఖానాపూర్ నియోజకవర్గనికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాల మొదటి విడతలోనే కట్టించాలనే ఏకైక ఉద్దేశ్యం తో పట్టణంలో స్థలం లేకపోవడంతోనే ఉట్నూరు లో సర్వే చేయించారని అన్నారు.

## రైతులకు బాసటగా "రైతు భరోసా"

### గురువారం నాటికీ రూ.200.01 కోట్లు నిధుల జమ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిది : వానాకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా జిల్లా రైతులకు మద్ధతు అందించేందుకు భారీగా నిధులు విడుదలయ్యాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం నాటికి నిర్మల్ జిల్లాలో రైతుల ఖాతాల్లోకి రూ.200.01 కోట్ల నిధులు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (DBT) పద్ధతిలో విజయవంతంగా జమ అయినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ఉన్న మొత్తం 1,86,400 మంది రైతుల్లో 1,70,114 మందికి ఈ పథకం ద్వారా నిధులు అందినట్లు తెలిపారు. మిగిలిన రైతుల ఖాతాల్లో కూడా త్వరలోనే నిధులు జమ కాబోతున్నాయని చెప్పారు. ఈ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి భారం తగ్గే అవకాశం లభిస్తుందని, దీంతో పంటల సాగు పనులు వేగంగా ప్రారంభించగలుగుతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. పంటలు పండించే ప్రతి రైతుకు చివరి గుంట భూమి వరకూ రైతు భరోసా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పంట ప్రారంభానికి ముందే నిధులు జమ కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

## నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

### యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సిద్ధల నాగరాజ్



నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విద్యార్థుల డిమాండ్



నారాయణ విద్యా సంస్థల ఫర్నిచర్ ను ధ్వంసం చేస్తున్న దృశ్యం

నిర్మల్ జిల్లా జూన్ 20 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలని సీజ్ చేయాలని ధర్నా చేయడం జరిగింది . ధర్నా చేసిన అనంతరం జిల్లా విద్యాధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా : యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సిద్ధల నాగరాజ్ గారు మాట్లాడుతూ :నిర్మల్ పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి నారాయణ విద్యాసంస్థలు ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా గత రెండు సంవత్సరాలుగా నిర్మల్ జిల్లాలో స్కూల్ నడుపుతున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని అన్నారు ప్రభుత్వం నుంచి ఒక విధంగా అనుమతి ఉంటే మరొక విధంగా పాఠశాలకు తోక పేర్లు పెడుతూ అక్రమంగా అడ్మిషన్ చేస్తూ మాయ మాటలు చెబుతూ కొనసాగుతున్నారు ప్రభుత్వం నుంచి అనుమతి ఉంటే జీవో ఇవ్వగలరు అని అన్నారు అలాగే అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్న అలాగే పాఠశాలలో యూనిఫాం పుస్తకాలు బ్యాగులు అమ్ముతున్నారు విద్యా చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు ఒకవేళ బయట పుస్తకాలు కొంటాము అంటే యజమాన్యాలు పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారు ఇదంతా జరుగుతున్నా కూడా మండల విద్యాధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం కూడా లేదు విద్యాశాఖ అధికారులు సర్కులర్ జారీ చేసినా కూడా కార్పొరేట్ విద్యాసంస్థలు నారాయణపై పట్టించుకోవడం లేదు విచ్చలవిడిగా పుస్తకాల దంధాన్ని కొనసాగుతున్నారు వెంటనే ఈ పాఠశాల పైన కఠిన చర్యలు తీసుకోవాలి లేనిపక్షంలో పాఠశాల ఎదురుగా ధర్నా చేస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్, పిడిఎస్యు అనిల్ , పిడి ఎస్యు నరేందర్, టి ఎన్ వి ఎస్, వెంకటేష్, పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు పవర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## సమాజ సేవకుడిని ఘనంగా సన్మానించిన 11 కేవీ విద్యుత్ తీగల బాధితులు

### బాధితుల సన్మానంతో ఆనందం వ్యక్తం చేసిన డాక్టర్ సప పండరి....



డాక్టర్ సప పండరి, ని ఘనంగా సన్మానిస్తున్న 11 కెవి విద్యుత్ తీగల బాధితులు



ఆందోళనకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు-విద్యుత్ తీగలు

నిర్మల్ జిల్లా కుబీర్ జూన్ 20 అమృత్ తెలంగాణ సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం “”’హైదరాబాద్ రీగల్ హోటల్ నందు నిర్వహించగా”””’కుబీర్ గ్రామంలోని న్యూ అబాది కాలనీ వాసులు గత 20 సంవత్సరాలుగా తీవ్ర అవస్థలకు గురవుతున్నారని, వర్ష కాలం వస్తే అద్దె ఇండ్లలో ఉండవలసి వస్తుందని, గత 8 సంవత్సరాల కిందట 8 ఇండ్లు పూర్తిగా దగ్ధం అయ్యాయని కేసు నమోదైనప్పటికీ, ఇప్పటివరకు పాలకులు, అధికారులు ఎందరో మారుతున్నప్పటికీ”””””’మా తలరాతలు మాత్రం మారడం లేదని””” జూన్ 23-2024 వరంగల్లోని TSNPDS సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి,కి సైతం వినతి పత్రం అందించామని, అంతే కాకుండా మాతో 4 లక్షల రూపాయల పై చిలుకు విద్యుత్ అధికారులు డిడి కూడా కట్టించుకొని సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, విద్యుత్ తీగలను మాత్రం తొలగిస్తే లేరని వాపోయారు. ఇట్టి విషయాన్ని గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు డాక్టర్ సాప పండరి సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి, ముధోల్ నియోజకవర్గ శాసనసభ్యులు రామారావు పటేల్ తొలగింపుకై కృషి చేస్తున్నారనే విషయాన్ని, ఆర్గనైజేషన్ ప్రతినిధుల సహకారం కావాలని కోరగా-సానుకూలంగా స్పందించిన నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ తప్పకుండ కృషి చేద్దామని హామీ ఇవ్వడం హర్షించదగ్గ విషయమని, ఈ రోజు “”’’సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ ధన్యవాదములు తెలియజేస్తూ, “”’’తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం RTI సెల్ చైర్మన్”””’డాక్టర్ సాప పండరిని తీపి తినిపించి,పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా న్యూ అబాది కాలనీ అధ్యక్షులు షేక్ హైదర్, సాప పోతన్న, బిట్లిన్ హనుమాన్లు,మేర రమేష్ యుసుఫ్,వహీద్ ఖాన్, ఫారుక్, మధ్వ పాషా,అయూబ్ ఖురేషి,కయ్యూమ్, మోసిన్, రఫిక్, వసీం

## అంతర్జాతీయ యోగ దశాబ్ది వారోత్సవాల సందర్భంగా, ఆయుష్ విభాగం నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణ స్కూల్, భాగ్యనగర్‌లో యోగ ఆసనాలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ఇంచార్జి డా. నారాయణ రావు, ఆయుష్ వైద్యులు వెంకటేశ్వర్లు, సంధ్యా రాణి, మనీషా, యోగ అధ్యాపకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజల్లో ఆరోగ్యపరమైన అవగాహన పెంచే ఉద్దేశంతో ఈవిధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ యోగ డే సందర్భంగా జూన్ 21న జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

## కామ్రేడ్ కర్రె పాండరికి విప్లవ జోహార్లు



యాదగిరిగుట్ట రూరల్ :అమృత్ తెలంగాణ: యాదగిరిగుట్ట మండలం మల్లాపురం శుక్రవారం, గ్రామ సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు కామ్రేడ్ కర్రె పాండరి(పాండన్న)జూన్ 19న అనారోగ్యంతో అమరులైన విషయాన్ని తెలుసుకున్న సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకత్వం పాండన్న పార్థీవ దేహంపై పూలమాలలు వేసి రెండు నిమిషాలు సంతాప సూచకంగా మౌనం పాటించి ఘనంగా విప్లవ జోహార్లు తెలియజేసింది. సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు బేజాడి కుమార్ మాట్లాడుతూ కామ్రేడ్ పాండన్న 1978-79 నుండి నాటి ఉమ్మడి సీపీఐ ఎం.ఎల్ నుండి తదనంతరం సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాలలో క్రియాశీలక పాత్రను పోషించాడు. అమరుడు కామ్రేడ్ కటకం అంజన్న సారథ్యంలో సాగిన భూస్వామ్య వ్యతిరేక,దున్నే వారికే భూమి పోరాటంలో, ప్రజలను వెంటాడుతున్న గ్రామంలో దొరలకు భూస్వాములకు, జీతగాళ్లకు జీతాలు పెరగాలని, కూలీ రేట్లు పెంచాలని, రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, భువనగిరి ఆలేరు నియోజకవర్గంలో రైతులకు సాగు తాగునీరు గంధమాల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని అనేక ఉద్యమాలలో చురుకుగా పాల్గొనడం జరిగింది.

వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం జరిగిన రైతాంగ, ప్రజా ఉద్యమాలలో కామ్రేడ్ పాండన్న ముందు వరుసలో ఉన్నాడని అన్నారు. కామ్రేడ్ పాండన్న పార్టీ ఆలోచన విధానం వెలుగులో, నిబద్ధత కలిగిన ఆచరణతో కార్యకర్తగా,నాయకునిగా నిజాయితీగా ప్రజా విముక్తి మార్గంలో నడిచిన ఆదర్శవంతుడని కొనియాడారు. నేడు కేంద్రంలో నరహంతక బీ జే పీ మోడీ ప్రభుత్వం పిడికెడు మందిగా ఉన్న బడా కార్పోరేట్ సంస్థలకు, సామ్రాజ్యవాదులకు దేశ సంపదను ప్రధానంగా అటవీ ఖనిజ సంపద ను యదేచ్ఛగా కొల్లగొట్టుక పోవడానికి గేట్లు ఎత్తివేశాడని, దేశ సంపదను భావితరాలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి తప్ప దోచుకుపోవడానికి, దేశానికి విద్రోహం తలపెట్టే దేశ, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తున్న ఆదివాసీలను, మావోయిస్టులను ప్రాణాలతో పట్టుకొని చిత్ర హింసలకు గురి చేసి దుర్మార్గంగా ఎన్ కౌంటర్ లని కథలల్లుతున్నారని, మావోయిస్టు లైన, ప్రజలు ఎవరైనా నేరం చేశారని తెలిస్తే చట్టబద్ధంగా అరెస్టు చేయకుండా, కోర్టుకు అప్పెప్పకుండా కాల్చిచంపారు.

ప్రజాస్వామ్య, రాజ్యాంగ, చట్ట విరుద్ధమైన ఆలోచనని అన్నారు. ఇలాంటి దుర్మార్గమైన పాలనను కొనసాగిస్తున్న ఆర్ ఎస్ ఎస్, బీ జే పీ మోడీ ఉద్దేశ పూర్వకంగానే వ్యవహరిస్తుందని ఈ సమయంలో కామ్రేడ్ కర్రె పాండన్న భౌతికంగా మన మధ్యన లేకపోవడం ప్రజా ఉద్యమాలకు తీరని నష్టమని అన్నారు.

## ఎస్సీ, ఎస్టీ శాఖలపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్..

భువనగిరి :అమృత్ తెలంగాణ: యాదాద్రి భువనగిరి జిల్లాకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, 5 మంది సభ్యులు తెలంగాణ రాష్ట్ర కమీషన్ ఎస్సి,ఎస్టి వారి సమీక్ష సమావేశమునకు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో రావాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం మినీ మీటింగ్ హాల్ లో ఈ నెల 21 న కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరగబోయే సమీక్ష సమావేశమునకు వివిధ శాఖల జిల్లా అధికారులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బక్కి వెంకటయ్య చైర్మన్ , 5 మంది సభ్యులు తెలంగాణ రాష్ట్ర కమీషన్ ఎస్సి , ఎస్టీ వారి సమీక్ష సమావేశమునకు సంబంధిత శాఖ అధికారులు సరైన జాబితా, పూర్తి సమాచారంతో రావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.వివిధ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ ద్వారా అమలు జరిగే పథకాలపై 2024-2025, 2025-26 ఆర్థిక సంవత్సరమునకు సంబందించిన పూర్తి సమాచారం తయారు చేసుకొని సమావేశంకు సకాలంలో హాజరు కావాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఇంచార్జ్ ఎస్సీ సంక్షేమ అధికారి శ్యాంసుందర్ , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కిడ్నాప్, దొంగతనాన్ని ఛేదించిన నిర్మల్ పోలీసులు..

## కిడ్నాప్, దొంగతనానికి పాల్పడిన ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు ...జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్.






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి నిర్మల్ జిల్లా మామడ పోలీస్ స్టేషన్ పరిధిలో పొనకల్ గ్రామంలో చోటు చేసుకున్న కిడ్నాప్, హత్యాయత్నం, దొంగతనం కేసును నిర్మల్ పోలీసులు వేగంగా ఛేదించారు. బాధితుడు చిక్యాల హరీష్ కుమార్ రావు, Ex DCCB ఛైర్మన్ అనే వ్యక్తిని కిడ్నాప్ చేసి, హత్యాయత్నం కు ప్రయత్నించి, బెదిరించి నగదు డిమాండ్ చేయడమే కాకుండా ఇంటిలోకి చొరబడి బంగారం, నగదును మరియు వాహనమును దొంగలించిన కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయటం జరిగింది.

కేసు నేపథ్యం:

ప్రధాన నిందితుడు షేక్ హైదర్ (వయసు 39, వృత్తి డ్రైవర్, నివాసం: పోనకల్ (గ్రామం) గతంలో ఇతను బాధితుడైన చిక్యాల హరీష్ రావు వద్ద డ్రైవర్ గా పనిచేసేవాడు, ఇతని ప్రవర్తన నచ్చక 6 నెలలకే పనిలోనుండి తీసివేయడం జరిగింది.దీనితో షేక్ హైదర్ పగ పెంచుకున్నాడు. అతను తన మిత్రుడు బానాల ప్రిన్స్ తో కలిసి ఈ కుట్రను పన్నాడు. వారి ప్రణాళిక మేరకు బానాల ప్రిన్స్ నివాసం గుంటూరు జిల్లా, తట్టురి రవి నివాసం విజయవాడ, కళకంటి సురేష్ నివాసం విజయవాడ, గూడె కోటేశ్వర రావు నివాసం విజయవాడ, మధుసూదన్ నివాసం పోనకల్ నిందితులుగా ఉన్నారు. కిడ్నాప్‌కు అవసరమైన కత్తులు, తాళ్లు, మాస్కులు, ప్లాస్టర్లు ముందుగానే సిద్ధం చేసుకున్నారు.

కిడ్నాప్ ఘటన వివరాలు:

కిడ్నాప్ కు ముందు నిందితులకు మధుసూదన్(పొనకల్) అనే వ్యక్తి హరీష్ రావు రాకపోకల వివరాలు తెలియజేస్తూ సహకరించాడు. దీని కోసం రెండు సార్లు ఎక్కి నిర్వహించారు. కిడ్నాప్ కోసం నిందితులు పటాన్ చెరువులో లాంగ్ డ్రైవ్ కోసం అని ఒక షిఫ్ట్ కార్ అద్దెకు తీసుకున్నారు. దానిలో అందరూ పొనకల్ కి చేరుకున్నారు. తేది: 15.06.2025 అర్ధరాత్రి సుమారుగా 1:45 గంటలకు, నిందితులు పోనకల్ గ్రామంలోని బాధితుడి ఇంటి పైకప్పు ద్వారా లోపల ప్రవేశించి, అతని చేతులు కాళ్ళు కట్టి, నోరుమూసి బెదిరించారు. బంగారు చైన్, రెండు బంగారు బిళ్ళలు, డైమండ్ ఉంగరం మరియు రూ. 5,000/- నగదును దొంగలించారు. అనంతరం బాధితుడిని అతని కారు ఇన్నోవా లో కిడ్నాప్ చేసి హైదరాబాద్ వైపు తరలించారు.

కిడ్నాప్ తరువాత మార్గంలో జరిగిన ఘటనలు:

బాధితుడిని రెండు కార్లలో (TS 01EF 0666 బాధితుని కారు మరియు TS 15FK 6442) హైదరాబాద్ వైపునకు తరలించడంలో నిందితులు జాగ్రత్తగా ప్రణాళిక అమలు చేశారు.

కారులో నిందితులు బాధితుడిని కత్తులతో బెదిరిస్తూ, అతని బంధువులకు ఫోన్లు చేయించి రూ. 3 కోట్లు డిమాండ్ చేశారు.

బాధితుడు హైదరాబాద్ లో ఉన్న బంధువులకు ఫోన్ చేసి డబ్బులు ఇచ్చేలా ఒత్తిడి ఎదుర్కొన్నాడు.నిర్మల్ జిల్లా పరిధిలో నిందితుడు హైదర్ బిజెపి మైనారిటీ మోర్చా కన్వీనర్ గా పనిచేయడం వల్ల అతనిని గుర్తిస్తారు అని ముందుగానే గుర్తించి టోల్ ప్లాజాలు తప్పించే మార్గాల్లో ప్రయాణించారు.

మనోహరాబాద్ టోల్ ప్లాజా వద్ద కార్ ఫాస్ట్ ట్యాగ్ స్కాన్ కాకపోవడంతో కారును ఆపాల్సి వచ్చింది. అదే సమయంలో బాధితుడు కట్లు విడిపించుకొని నిందితులను తోసి కారులో నుంచి బయటికి దూకి పరారయ్యాడు.

దొరికిపోతామన్న భయంతో నిందితులు బాధితుని కారును టోల్ ప్లాజా కు కొద్ది దూరం లో వదిలేసి, వారు కిరాయికి తెచ్చుకున్న మరొక కారులో దోచుకున్న సొత్తు తో పరారయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ గారు, స్పందించి కేసును ఛేదించడం కోసం ప్రత్యేక శ్రద్ధ కనబరచారు ,ఏఎస్పి నిర్మల్ రాజేష్ మీన ఐపిఎస్ నేతృత్వం లో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞాన సహాయం తో చాక చక్యంగా నాలుగు రోజుల్లోనే నిందుతులని పట్టు కోవటం జరిగింది.

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు:

కిడ్నాప్‌కు వాడిన కార్ (TS 15FK 6442)

బంగారు చైన్

బాధితుడి పర్సు

నగదు రూ. 2,000/-

6 సెల్ ఫోన్ లు

రెండు కత్తులు

రెండు ఇంచుల ప్లాస్టర్లు

నిందితులు వదిలివేసిన బాధితుని కారు TS 01EF 0666

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..

ఈ కిడ్నాప్ రాష్ట్రం లో చాలా సంచలనం సృష్టించింది. కిడ్నాప్ ను కేవలం మూడు రోజుల్లో ఛేదించి నిందితులను పట్టుకోవటం జరిగింది. జిల్లా పోలీసులు ప్రజల రక్షణ కోసం కట్టుబడి ఉన్నారు. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలుంటే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు న్యాయం చేస్తూ, నేరాలపై కఠినంగా వ్యవహరిస్తుంది. ప్రజల సహకారం ఎంతో అవసరం. ఏవైనా అనుమానాస్పద చట్టవిరుద్ధ కార్యకలాపాలుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.


కేసు ఛేదనలో ఏ.ఎస్పీ నిర్మల్ రాజేష్ మీన ఐపిఎస్, ఇన్స్పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, కృష్ణ, సమ్మయ్య, ఎస్ఐలు ప్రదీప్, శ్రీనివాస్, లింబాద్రి, శ్రీకాంత్, అశోక్, హెడ్ కానిస్టేబుల్ తాహేర్ ఖాన్,కానిస్టేబుల్స్ రాజేందర్, ముత్యం,సంతోష్,రాజు, సాయి కృష్ణ, ప్రవీణ్ దయాకర్,రమేష్, రాజ్ కుమార్, హోమ్ గార్డులు తక్కన్న,తిరుపతి,రమణ లను టీం లు చాకచక్యంగా పని చేశారు. వీరిని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐ.పి.ఎస్ గారు ప్రత్యేకంగా అభినందించారు.

నిందితుల వివరాలు:

1. షేక్ హైదర్ నివాసం పొంకల్,
2. బనాల ప్రిన్స్ నివాసం గుంటూరు
3. తట్టురి రవి నివాసం విజయవాడ
4. కళకంటి సురేష్ నివాసం విజయవాడ
5. గూడె కోటేశ్వర రావు నివాసం విజయవాడ
6. మధుసూదన్ (పొనకల్)

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి న్యూస్ : జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 1వ, 5వ తరగతులలో ప్రవేశాల కోసం విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన జిల్లా అధికారులతో కలిసి లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వెనుకబడిన కులాల విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల స్థాయిలో కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపిక కాలేని విద్యార్థులు, తల్లిదండ్రులు నిరాశ చెందవద్దన్నారు. ఈ సంవత్సరం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం 1వ తరగతికి 83 దరఖాస్తులు అందగా, లక్కీ డ్రా ద్వారా 49 మందిని ఎంపిక చేయగా, 5వ తరగతికి 247 దరఖాస్తులు వచ్చి, 52 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఒక్కో తరగతికి తగినంగా ఉచిత రవాణా, వసతి, పుస్తకాలు, యూనిఫాం వంటి సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి వి. రాజేశ్వర్ గౌడ్, జిల్లా విద్యాధికారి పి. రామారావు, సహాయ సంక్షేమ అధికారి డి. లత, పర్యవేక్షకులు శ్రీదేవి, డిసిఓ ప్రశాంతి, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వై.ప్రసాద్

పెద్దవూర : అమృత్ తెలంగాణ: పెద్దవూర మండల నూతన సబ్ ఇన్స్పెక్టర్ గాశుక్రవారం వై.ప్రసాద్ భాధ్యతలు స్వీకరించారు.ఈయన త్రిపురారం ఎస్ఐ గా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా పెద్దవూర ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ ఐ వీరబాబు నల్గొండ ఎస్పీ ఆఫీస్ వీఆర్ బదిలీ చేశారుఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూనే చట్టాన్ని ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. నిషేధిత గుట్కా, గంజాయి విక్రయాల అరితామని, దానితో పాటు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈ వ్ టీజింగ్, పాల్పడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఆపద సమయంలో డయల్ 100 నెంబర్ కు ఫోన్ చేసి పోలీసుల సహాయాన్ని పొందాలని ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్ఐ తెలిపారు.



# నిర్మాణం లో ఉన్న మల్టీపర్పస్ సెంటర్ ను సందర్శించి పరిశీలించిన ప్రత్యేక అధికారి డిప్యూటీ సెక్రటరీ గణేష్ నిరంజన్





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఇంద్రవెల్లి మండలం మారుతిగూడ పీవీటీజి హాబిటేషన్ లో నూతనంగా నిర్మిస్తున్న మల్టీపర్పస్ సెంటర్ ను శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ప్రభారి డిప్యూటి సెక్రెటరీ గణేశ్ నిరంజన్ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా తో కలసి పరిశీలించారు . పీఎం జన్ మన్ లో మంజూరైన 60 లక్షల రూపాయలతో నిర్మించిన మల్టీ పర్పస్ సెంటర్ లో మల్టిపర్పస్ హాల్, సబ్ సెంటర్, క్లాస్ రూమ్ , అంగన్వాడి సెంటర్, ఆఫీసర్స్ రూమ్స్, టాయిలెట్స్, కారిడార్స్ 6 గిరిజనుల సౌకర్యార్థం, వారి ఆరోగ్యం, మౌళిక వసతుల కల్పన, అభివృద్ధి, శ్రేయస్సు కొరకు నిర్మించడం జరిగిందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది విధులలో అప్రమత్తతో వ్యవహరించాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

విలేజ్ పోలీసు విధానాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలి.

విధుల నందు క్రమశిక్షణ సమయపాలన తప్పనిసరి

స్టేషన్లోని ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన విధులను తప్పనిసరిగా నిర్వహించాలి.

ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ







అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : విధులలో పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ సమయపాలన తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. ఈరోజు ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ సిబ్బందిని ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి పరిశుభ్రతతో పోలీస్ స్టేషన్ నిర్వహించాలని సూచించారు. కేసులలో ఉన్న వాహనాలను పరిశీలించి వాటి ప్రస్తుత స్థితి గతి పై ఆరా తీశారు. తదుపరి పోలీస్ స్టేషన్ ను పరిశీలించి రికార్డుల నవీకరణలను ప్రతిరోజు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టులను చార్జి షీటు దాఖలు చేయాలని తెలిపారు. గ్రామాలను సందర్శిస్తూ పోలీసు మీకోసం కార్యక్రమాల నిర్వహించాలని తెలిపారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్ ను కేటాయించి గ్రామాలలో జరుగుతున్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. రానున్నది పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్క సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరిస్తూ, పూర్తి సంసిద్ధమై ఉండాలని తెలిపారు. డయల్ 100, బ్లూ కోర్ట్, పెట్రో కార్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రమాదాలను నేరాల నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు. కోర్టుల నందు పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరించినప్పుడే పోలీసుల పట్ల కోర్టుల నమ్మకం మరింత పెరుగుతుందని సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ బాధితులకు సత్వరమే న్యాయం అందించే విధంగా పోలీసు అధికారులను కేటాయించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్, ఉట్నూర్ సీఐ జి మొగిలి, ఎస్సై సాయన్న సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ లో బైటాయించిన బీఆర్ఎస్ నాయకులు



మంచిర్యాల : అమృత్ తెలంగాణ: జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి బీఆర్ఎస్ విద్యార్థి నాయకుడు దగ్గుల మధుపై జరిగిన దాడిని ఖండిస్తూ మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ లో బైటయించి నిరసన వ్యక్తం చేశారు. మంచిర్యాల నియోజక వర్గ బీఆర్ఎస్ నాయకులు దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి చౌరస్తాలో నిరసన కార్యక్రమం చెపట్టారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల జోక్యం చేసుకున్నా.. నాయకులు నిరసన కార్యక్రమాన్ని విరమించలేదు. నిందితులను అరెస్ట్ చేసినకే పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వెళ్ళిపోతాం అంటూ నాయకులు తెలపడంతో దాదాపు గంట సేపటి నుంచి నిరసన కొనసాగుతుంది.

# మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం



తుర్కపల్లి :అమృత్ తెలంగాణ: తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన బండారి చంద్రమౌళి ఇటీవల మృతి చెందడంతో ఆయనతో చదువుకున్న 1987- 88 సంవత్సర 10వ తరగతి బ్యాచ్ మెంట్స్ శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి 14 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలుగుల రమణ, పత్తిపాటి రమణకర్, చిక్క రాజు, తోట నాగేశ్వర్, జైని రాజేశ్వర్, కుక్కుటం వెంకటేశం, గుజ్జ మనోహర్, జిల్లా శ్రీనివాస్, కొక్కొండ నరేందర్ ,ఎండి ముస్తఫా, ఎండి ఇబ్రహీం ,నీలం రవీందర్, సింగం వెంకటేశం, పసునూరి విజయ్ కుమార్, పలుగుల అమరేందర్, బాలమణి ,శోభారాణి, పద్మ, అన్నపూర్ణ ,ఎండి మహిభూషణ్ బండారి యాదగిరి, అశోక్ పాల్గొన్నారు.

# పోలీసుల పిల్లలు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

ఐఐటి లో ర్యాంకు సాధించిన హెూంగార్డు కుమార్తెను శాలువాతో సన్మానించి అభినందించిన జిల్లా ఎస్పీ.
హెూంగార్డు కనక పునరామ్ కుమార్తె వైష్ణవి కి ఐఐటి అడ్వాన్సులో 1581 ర్యాంక్.
మిఠాయి తినిపించి అభినందనలు తెలియజేసిన జిల్లా ఎస్పీ.





**అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్**

పోలీసుల పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయం నందు విధులు నిర్వర్తిస్తున్న హెూంగార్డు కనక పునరామ్ కుమార్తె కె వైష్ణవి ఐఐటి నందు దేశంలోనే 1581 ర్యాంకును సాధించి ఐఐటి ముంబై నందు జియో ఫిజిక్స్ కోర్సులో సీటును సంపాదించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిని వారి కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ స్వయంగా పోలీసు ముఖ్య కార్యాలయానికి ఆహ్వానించి, శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించే అభినందనలు తెలియజేశారు. ఇలాగే జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, ఎన్ చంద్రశేఖర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు రూ 8 లక్షల భద్రతా చెక్కు అందజేత.

బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

మార్చి నెలలో అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఆర్ దిగంబర్

ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయం నందు మార్చి నెలలో అనారోగ్యంతో మరణించిన ఆర్ దిగంబర్ కుటుంబ సభ్యులకు భద్రత ద్వారా వచ్చిన ఎనిమిది లక్షల రూపాయల విలువ చేసే చెక్కును జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ అందజేశారు. ఈ సందర్భంగా రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ ఆర్ దిగంబర కుటుంబ సభ్యులైన భార్య రాథోడ్ శోభ భాయి మరియు కుమారుడు, అరుణ్ కుమార్ లతో మాట్లాడుతూ ఇలాంటి అత్యవసర సమయంలోనైనా జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు.

ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ది త్వరగా వచ్చే విధంగా తగు చర్యలను చేయాలని పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు ఆదేశించారు. కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చే విధంగా సిఫార్సులను వెంటనే పంపాలని ఆదేశించారు. పెన్షన్ ప్రారంభం అయ్యేలా చూసుకోవాలన్నారు. వచ్చిన డబ్బును జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, బి సూపరింటెండెంట్ సులోచన, అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సిసి కొండ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విలేఖరిపై కేసు నమోదు..




జన్నారం : అమృత్ తెలంగాణ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపల్ బండి రాములును రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసిన, సూర్యరేఖ ఈ న్యూస్ రిపోర్టర్ జమీర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపారు. వివరాల్లోకెళ్తే.. ఈనెల 16న సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో కాలేజ్ స్టూడెంట్స్ కి ట్రైనింగ్ ఇస్తున్న సమయంలో జన్నారంకి చెందిన సూర్య రేఖ ఈ న్యూస్ రిపోర్టర్ జమీర్ ప్రభుత్వ ఐటిఐ కాలేజ్ కి వెళ్లి నేను సూర్యరేఖ ఈ న్యూస్ పేపర్ జర్నలిస్ట్ అని చెప్పి, తనకి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో ప్రిన్సిపల్ ఎందుకు ఇవ్వాలి అని వాదించారు. అదే విషయం మనసులో పెట్టుకొని నువ్వు ఇక్కడ ఎలా డ్యూటీ చేస్తావో నేను కూడా చూస్తా అని అంటూ బెదిరిస్తూ.. నీపై పేపర్లో కథనాలు ప్రచురిస్తాను అంటూ బ్లాక్ మెయిల్ చేస్తూ .. సూర్య రేఖ ఈ న్యూస్ పేపర్ లో తనపై తప్పుడు కథనాలు ప్రచురించినాడు. తన విధులకు ఆటంకం కల్పించినాడు. అని ప్రభుత్వ ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపల్ బండి రాములు ఇచ్చిన పిర్యాదు మేరకు జర్నలిస్టు అయినా జమీర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనూష తెలిపారు.

తనపై వచ్చిన ఆరోపణలని అవాస్తవాలు: ప్రిన్సిపల్ రాములు

తనపై సూర్య రేఖ ఈ న్యూస్ రిపోర్టర్ జమీన్ రాసిన వార్తలు, సోషల్ మీడియాలో చేసినవన్నీ అసత్యాలని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ బండి రాములు అన్నారు. తనను రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా.. ఇవ్వనందుకే తనను బ్లాక్ మెయిల్ చేశాడన్నారు. నా విధి నిర్వహణ ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తూ నా పనులను నేను చేసుకుంటున్నాను అన్నారు. గత 13 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఎక్కడ కూడా తనపై రిమార్కు లేదన్నారు. తన విధి నిర్వహణలో తను ఎలాంటి తప్పులు చేయలేదన్నారు.

# మందకృష్ణకు ఘన సన్మానం



భువనగిరి: అమృత్ తెలంగాణ: వికలాంగుల హక్కుల కోసం, ఆత్మాభిమానం కోసం, అధిక పెన్షన్ కోసం గత 17 సంవత్సరాలుగా పోరాడుతున్న మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం "పద్మశ్రీ "అవార్డును ప్రకటించడంతో, హర్షం వ్యక్తం చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా వికలాంగులు గురువారం నాగోల్ లోని శుభం కన్వెన్షన్ సెంటర్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి ( వి.హెచ్ పి ఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ధరణీకోట నర్సింహ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు వికలాంగులు పంచాయతీ నుండి పార్లమెంటు వరకు ఎన్నికల్లో పోటీ చేసి ,రాజకీయ రంగంలో వికలాంగులు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జనాభా దామాషా ప్రకారం వికలాంగులుకు సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సన్మాన కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు అనంతుల ఎల్లారెడ్డి , సింగం కరుణాకర్, సింగారం రమేష్, ఎర్ర వీరయ్య,లోడి ధనుంజయ,మచ్చ ఉపేందర్, ఇంజ పద్మ, కాటేపల్లి రజిత, పాక నాగరాణి పాల్గొన్నారు

# పెనిమిళ్ళ స్కూల్ ను విజిట్ చేసిన విద్యాశాఖ కమిషన్ మెంబర్


ఉప్పునుంతల : అమృత్ తెలంగాణ: ఉప్పునుంతల మండలంలోనీ పెనిమిళ్ళ జడ్పీహెచ్ఎస్ పాఠశాల స్థితిగతులపై తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ మెంబర్ చారగొండ వెంకటేష్ గురువారం స్కూల్ ను సందర్శించారు. ఈనెల 13న మా గ్రామ ప్రభుత్వ పాఠశాల స్థితిగతులపై పర్యవేక్షించాలని గ్రామస్తుల వినతి మేరకు గురువారం పెనిమీల్ల గ్రామాన్ని ఆయన సందర్శించి ప్రభుత్వ పాఠశాల స్థితిగతులపై ఆయన అధ్యయనం చేసినట్లు తెలిపారు. శిధిలావస్థకు చేరి వర్షాలు పడ్డప్పుడు తడిసిన పాఠశాల తరగతి గదులను, మధ్యాహ్నం భోజనం కోసం దాచే సరుకులకు కూడా నోచుకొని వంట గది,వినియోగంలో లేని మూత్రశాలలు,అక్కరకు రాని విధంగా ఉన్న అంగన్వాడీ సెంటర్ ను చూసి ఆయన చలించిపోఅయినట్లు తెలిపారు. మండలంలో పెద్ద జనాభా కలిగిన గ్రామం విద్యా విషయంలో పెద్ద సమస్యలో ఉందని ఆయన అన్నారు. విద్య అనేది ప్రతి పౌరునికి ప్రాథమిక హక్కు విద్యా విధానం మెరుగుపడ్డప్పుడే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన గుర్తు చేశారు. పాఠశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేయనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. చిన్నప్పుడు అదే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చిన అదే గ్రామానికి చెందిన వ్యాపారవేత్త అయిన మారం సురేష్ రెడ్డి గతంలో తన తండ్రి జ్ఞాపకార్థంగా రెండు తరగతి గదులు నిర్మించిన దాతగా గుర్తించిన ఆయనకు వెంటనే ఫోన్ చేసి త్వరలో నిర్మించబోయే నూతన పాఠశాల భవనానికి కావాల్సిన ఇన్ఫ్రాస్ట్రక్చర్ కోసం మళ్ళీ తమ వంతుగా బాధ్యత వహించాలని చారగొండ వెంకటేష్ కోరడంతో ఆయన వెంటనే ఒప్పుకున్నట్లు తెలిపారు.ప్రభుత్వం కృషికి దాతల తోడ్పాటు కూడా ఎంతో అవసరమన్నారు.

# సీతకి వయసు తో వచ్చిన కష్టాలు పాపం..!



సీతారామం సినిమా తో తెలుగు లో ఒక్కసారిగా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. హిందీలో ఈమె సినిమాల్లో ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయ్యింది.. అంతకు ముందే సీరియల్స్ లో కూడా ఈ అమ్మడు చాలానే పాపులారిటీని సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం దక్కిన స్టార్ డమ్.. సూపర్ హిట్ మాత్రం ఆమెకు ఇన్నాళ్ల సినీ కెరీర్ లో దక్కలేదనే చెప్పాలి. దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన సీతారామం సినిమాలో సీత పాత్రకు అచ్చు గుద్దినట్లుగా అద్భుతంగా సెట్ అవ్వడంతో ప్రతి ఒక్కరు కూడా ఫిదా అయ్యారు.. ఇంకా కూడా అవుతూనే ఉన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో వరుసగా సినీ ఆఫర్లు దక్కించుకుంటున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. ఒక పాత్ర కోసం వేశ్య గృహంలో ఉండాల్సి వచ్చిందని చెప్పిన మృణాల్ ఠాకూర్ కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సవాళ్లు గురించి పలు ఆసక్తికర విషయాలను చెప్పింది. ఇదే సమయంలో ఆమె తన వయసు గురించి కాస్త అసహనంతో మాట్లాడింది. నా వయసు ప్రస్తావన వచ్చిన ప్రతి సారి కూడా చాలా మంది పెళ్లి గురించి అడుగుతూ ఉంటారని.. ప్రేమ లో పడలేదా అంటూ ఆశ్చర్యంగా ఫేస్ పెడతారు అంటూ మృణాల్ పేర్కొంది. నా వయసు 30 ఏళ్లు అంటూ చెప్పగానే మీరు పెళ్లి చేసుకోవాల్సిన సమయం వచ్చినట్లుంది.. పెళ్లి పై మీ యొక్క అభిప్రాయం అంటూ చాలా మంది ప్రశ్నలతో ముంచెత్తుతున్నారు. ఎన్నో సార్లు సమాధానం చెప్పినా కూడా ప్రేమ గురించి నన్ను ఎప్పుడూ ఎవరో ఒకరు ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రేమ గురించి నాకంటూ ఒక అవగాహన ఉందని మృణాల్ పేర్కొంది.

# వెబ్ సిరీస్ లో ఊర్మిళ దుమారం తప్పదా?



బాలీవుడ్ బ్యూటీ ఊర్మిళ మండోత్కర్ నాలుగేళ్లగా సినిమాలకు దూరంగా ఉంటోన్న సంగతి తెలిసిందే. అవకాశాలు రాక...సరైసనన పాత్రలు దొరకక గ్యాప్ ఇచ్చిందా? అన్నది క్లారిటీ లేదు గానీ..ఊర్మిళ తెరపై ఎప్పుడు కనిపించినా ఓ సంచలనమే అన్నది వాస్తవం. యాభైకి చేరువలోనూ ఊర్మిళ ధగధగల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వెండి తెరపై మెరిసిన అమ్మడు బుల్లి తెరపైనా తనదైన మార్క్ వేసింది. పలు రియాల్టీ షోలను హెూస్ట్ చేసి ఐడెంటీ వేసింది. ప్రస్తుతం డిడ్ సూపర్ మామ్స్ సీజన్ -3రని హెూస్ట చేస్తోంది. తాజాగా ఊర్మిళ వెబ్ సిరీస్ లకు సై అనేసింది. 'తివారీ' అనే వెబ్ సిరీస్ కి కమిట్ అయినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె ద్విపాత్రాభినయం చేస్తుంది. తల్లి -కుమార్తె నేపథ్యంలో సాగే స్టోరీ కావడంతో ఆ రెండు పాత్రలు కూడా ఆమె పోషిస్తుందిట. పాత్రలకు సంబంధించి ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటుందిట. గత ఆరు నెలలుగా అదే పనిలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పాత్రల గురించి స్పందించింది. ' నాలోని నటికి తివారీ సవాల్ విసురుతుంది. ఇందులో అనుబంధాలే కాదు.. ఊహించని మలుపు యాక్షన్ సన్నివేశాలు..రొమాంటిక్ సీన్లు ఉంటాయని' రివీల్ చేసింది. మొత్తానికి ఊర్మిళ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ గట్టిగానే ఊపేటట్లు కనిపిస్తుంది. స్టార్ హీరోయిన్ గా కొనసాగినంత కాలం బాలీవుడ్ ని ఓ ఊపు ఊపేసింది. ఆ తర్వాత ఒక్కసారిగా చల్లబడింది. కొంత కాలంగా సరైన అవకాశాలు రావడం లేదు. ఈ క్రమంలో కొంత గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇప్పుడు ఓటీటీని షేక్ చేయడానికి రెడీ అవుతోంది. ప్రస్తుతం వెబ్ సిరీస్ ల్లోకి స్టార్ హీరోయిన్లు సైతం ఎంట్రీ ఇస్తున్నారు. ఈక్రమంలో అక్కడా పోటీ వాతావరణం కనిపిస్తుంది. ఒకరికొకరు పోటీ పడుతూ సత్తా చాటుతున్నారు. వెండి తెరను మించి ఓటీటీ బోల్డ్ కంటెంట్ లో విచ్చలవిడిగా నటించడానికి ఎలాంటి అడ్డంకులు పెట్టడం లేదు. ఛాన్స్ ఇవ్వాలే గానీ.. దర్శకుడి సృతజాన్మతకని మించి పెర్ఫార్మెన్స్ ఇస్తున్నారు. మరి ఆ రకంగా ఊర్మిళ కూడా రేసులో నిలుస్తుందా? అన్నది చూడాలి. ఊర్మిళ తెలుగులోనూ అంతే ఫేమస్. ఆమె 'అంతం'..'గాయం'..'అనగనగా ఒక రోజు' లాంటి తెలుగు చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే.

# మంచి ఆఫర్లు రాబడుతున్న 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్'



'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా అక్టోబర్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సోషల్ మీడియా సర్కిల్స్ లో మంచి సంచలనం సృష్టించింది. చిత్రాన్ని ఎక్కువ మంది ప్రేక్షకులను చేరుకోవడానికి మేకర్స్ తమ ప్రయత్నాలను రెట్టింపు చేస్తున్నారు. ఇంతకుముందు విడుదల చేసిన క్రేజీ ట్రైలర్ మరియు ప్రమోషనల్ సాంగ్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఇది బయ్యర్ల నుండి మంచి ఆఫర్లు రావడానికి దోహదపడినట్లు సమాచారం. 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' చుట్టూ నెలకొన్న హైప్ దృష్ట్యా ఈ సినిమా ఆంధ్ర నైజాం మరియు సీడెడ్ ఏరియాలకు బయ్యర్లు సుమారు 3 కోట్ల కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. యునిక్ కాన్సెప్ట్.. ప్రత్యేకమైన కథనం ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఇస్తుందని సినీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సినిమా ప్రీ క్లైమాక్స్ పార్ట్ ఎప్పుడూ చూడని ఎమోషన్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని అంటున్నారు. అలాగే సంగీతం సినిమాటోగ్రఫీ మరియు క్రిస్పీ ఎడిటింగ్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని పేర్కొంటున్నారు. దీన్ని బట్టి చూస్తే 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా మంచి బిజినెస్ డీల్ తో ముగించే అవకాశం ఉందని అనుకోవచ్చు. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ లో విశ్వంత్ - మాళవిక సతీషన్ హీరోహీరోయిన్లుగా నటించారు. ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ మరియు స్వస్తిక సినిమా బ్యానర్స్ పై నిరంజన్ రెడ్డి - వేణు మాధవ్ పెద్ది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు



ఈశాన్యామహేశ్వరి హాట్ ఇన్ రెడ్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com